www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
ఆదివారం | 26 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## జిల్లాలో డీజిల్ కొరత

-ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు




2 లో

# మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న ప్రజలు..!

-అడుగంటుతున్న భూగర్భ జలాలు
-45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
-జాగ్రత్తగా ఉండాలని అధికారుల హితవు





**ప్రజాపక్షం/ఖమ్మం :** ఎండలు మండిపోతున్నాయి. మే మాసానికి ముందే 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం ఎనిమిది గంటలకే భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. పది గంటలకు బయటకు రాలేని పరిస్థితి. రోడ్లు నిర్మానుష్యంగా మిగతా 2లో..

## సొసైటీ నామినెటెడ్ సందడి

-ఎన్నికలు లేకుండానే పాలక మండళ్లు
-వారి నుంచే డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్ల ఎన్నిక
-గ్రామాల్లో పైరవీల జోరు




**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నామినెటెడ్ సందడి మొదలైంది. అధికార పార్టీ నేతల్లో కదలిక ప్రారంభమైంది. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రి వర్గం ప్రాథమిక సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా పాలక వర్గాలను నామినెటెడ్ చేయాలని నిర్ణయించింది. ఖమ్మం డిసిసిబి పరిధిలో 101 ప్రాథమిక సంఘాలు ఉన్నాయి. గతంలో 2020లో ఈ సంఘాలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మెజార్టీ సంఘాలను అధికారంలో ఉన్న బిఆర్ఎస్ గెలుచుకుంది. ఖమ్మం డిసిసిబి, డిసిఎంఎస్ స్థానాలను బిఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఈ దఫా ఎన్నికలు మిగతా 2లో..

## ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్



-ఐదు గంటల పాటు అర్జీలు స్వీకరించిన మంత్రి
-న్యాయమైన సమస్య అయితే వెంటనే పరిష్కరించే బాధ్యత నాదే : పొంగులేటి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామంలో ప్రజా దర్బార్‌లో కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 10 గ్రామ పంచాయతీలకు సంబంధించిన అర్జీలను స్వీకరించిన మంత్రి, సుమారు ఐదు గంటల పాటు ప్రజల మధ్యే ఉండి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు సమస్యల పరిష్కారం కోసం చెప్పులు అరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగే వారని మిగతా 2లో..

## తాగునీటి ఎద్దడిపై సత్వరమే స్పందించాలి



- పైపులైన్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి : ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** వేసవిలో ఎదురయ్యే తాగునీటి ఎద్దడిపై అధికారులు తక్షణమే స్పందించి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక సింగరేణి అతిధి గృహంలో మిషన్ భగీరథ, కొత్తగూడెం కార్పొరేషన చైర్మన్, పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడైనా బోర్ల మరమ్మత్తులు ఉంటే తక్షణమే చేయాలని, అవసరమైన చోట కొత్తబోర్లుల వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నీటి సరఫరాలో అంతరాయం వాటిల్లకుండా పైపులైన్ల లీకేజీలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. కొత్తపైపు లైన్ల ఏర్పాటు పనుల్లో వేగం పెంచాలని స్పష్టం చేశారు. కొనసాగుతున్న నీటి పథకాల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోనికి తేవాలన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతీ చివరి ఇంటికీ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. నీటి సమస్యపై ప్రజల నుండి ఫిర్యాదులు వస్తే తక్షణమే స్పందించాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ గణేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న ప్రజలు..!



**(మొదటిపేజీ తరువాయి)**
మారుతున్నాయి. ముఖ్యంగా పారిశ్రామిక ప్రాంతాల్లో భానుడు భగభగకు ప్రజలు తాళలేకపోతున్నారు. ముఖ్యంగా సింగరేణి ఉపరితల గనుల వద్ద అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇల్లందు, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు పారిశ్రామిక ప్రాంతాల్లో వేసవి ఉపశమన చర్యలు చేపట్టాలని కార్మికులు కోరుతున్నారు. గతంలో ఎండ నుంచి ఉపశమనం పొందెందుకు యాజమాన్యాలు చర్యలు చేపట్టాయి. మజ్జిగ ప్యాకెట్లు ఇవ్వడం, భూ ఉపరితలాన్ని నీళ్లతో చల్లి ఉష్ణోగ్రతలు తగ్గించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు అటువంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇటీవల గోదావరి పరివాహక ప్రాంతంలోని చర్లలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వేసవి పరిస్థితి ఇలా ఉండగా ఎండ వేడిమికి భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. రానున్న నెల రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడక ముందే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల వరకు నాగార్జున సాగర్ కాలువకు నీళ్లు రావడంతో నాగార్జున సాగర్ ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాల పరిస్థితి ఫర్వాలేదనిపించిన మిగిలిన ప్రాంతాల్లో మాత్రం ఈ ఏడాది నీటి కష్టాలు తప్పకపోవచ్చునన్న భావన ఏర్పడింది. అత్యధిక అటవీ ప్రాంతం కలిగిన ఉమ్మడి ఖమ్మంజిల్లాలో అటవీ ప్రాంతంలోని జంతువుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని గతంలో మాదిరి నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. ఎండ వేడిమికి ప్రజలు బయటకు రాకపోవడంతో వీధి వ్యాపారుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. మొత్తం ఈ ఏడాది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రానున్న కాలంలో ఎండలు మరింత పెరిగే అవకాశం ఉందన్న ప్రచారం ఆందోళనను కలిగిస్తుంది. ఇదిలా ఉండగా ఎండకు వీలైనంత మేర ప్రయాణాలు మానుకోవాలని తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళితే తప్పనిసరిగా ఉపశమన చర్యలు చేపట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉపాధి హామీ కూలీలు, రోజు వారి కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# జిల్లాలో డీజిల్ కొరత

**ప్రజాపక్షం/ ఖమ్మం :** పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావమో లేక మరేదైనా కారణమో తెలియదు కానీ మూడు రోజులుగా జిల్లాలో డీజిల్ కొరత ఏర్పడింది. సగానికి పైగా బంకుల్లో డీజిల్ లేకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా బంకులకు ముందు డీజిల్ లేదన్న బోర్డులు కనిపిస్తున్నాయి. ఒక పక్క ముమ్మరంగా యాసంగి వరి కోతల యంత్రాలు, మరో పక్క రవాణాకు చెందిన వాహనాలకు డీజిల్ దొరక్కపోవడంతో వస్తు రవాణాకు ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా రైతుల వ్యవసాయ ఉత్పత్తులు తరలింపు విషయంలోనూ డీజిల్ కొరత అడ్డంకిగా మారింది. దిగుమతులు లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తుంది. ఆయిల్ సంస్థల ప్రతినిధులు డీజిల్‌కు సంబంధించి ఇండెంట్ పెట్టవద్దని బంకు యజమానులకు సూచిస్తున్నట్లు సమాచారం. కొందరు బంక్ యజమానులు పెట్టిన ఇండెంట్లను సైతం క్యాన్సిల్ చేయిస్తున్నారు. పెట్రోల్‌కు మాత్రం ప్రస్తుతానికి కొరత లేదు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ డీజిల్ విషయమై తగు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# సొసైటీ నామినెటెడ్ సందడి

**(మొదటిపేజీ తరువాయి)**
నిర్వహించకుండా పాలక వర్గాలను నియమించితే అధికార పార్టీకి చెందిన వారికే పదవులు దక్కే అవకాశం ఉంది. ప్రతి సహకార సంఘంలోనూ 13 మందితో పాలక వర్గాలను ఏర్పాటు చేయడంతో పాటు గతంలో మాదిరి రిజర్వేషన్లను కూడా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో గ్రామాల్లో ఆశావాహుల్లో సందడి మొదలైంది. ఆయా సొసైటీల పరిధిలోని సహకార సంఘాల అధ్యక్ష పదవి కోసం పైరవీల జోరందుకుంది. ఖమ్మం జిల్లాలో బోనకల్ మండలంలో అత్యధికంగా తొమ్మిది సొసైటీలు ఉన్నాయి. నియోజక వర్గాల పరంగా చూస్తే సత్తుపల్లిలో ఎక్కువ సొసైటీలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో కొత్తగూడెం మినహా అన్ని నియోజక వర్గాల్లోనూ అధికార పార్టీ శాసన సభ్యులే ఉండడంతో శాసనసభ్యుల అనుచరులు పైరవీల కోసం అధికార పార్టీ నేతల చుట్టూ తిరుగుతున్నారు. సొసైటీల్లో నామినెటెడ్ పదవులు ఎవరిని వరించనున్నాయనేది తేలాల్సి ఉంది. సొసైటీ అధ్యక్షులు డిసిఎంఎస్, డిసిసిబి ఛైర్మన్లను ఎన్నుకుంటారు. తర్వాత ఆప్కాబ్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది.

# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజా దర్బార్'



**(మొదటిపేజీ తరువాయి)** కానీ నేడు ప్రజా ప్రభుత్వం ప్రజల వద్దకే వచ్చి సమస్యలను పరిష్కరిస్తోందని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగమే ఈ ప్రజా దర్బార్ అని వివరించారు. ప్రజలకు మంచి జరిగే పనిని ఏ పార్టీ వారు అడిగినా రాజకీయాలకు అతీతంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 27 నుండి ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వేసవి కాలంలో ఎదురయ్యే తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు ముఖ్యంగా భూ సమస్యలను పాలేరు నియోజకవర్గంలో ముందుగా పరిష్కరించి, ఆ తర్వాతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని మంత్రి ప్రకటించారు. ప్రజా దర్బార్ పెట్టామంటే ప్రజలకు మా ప్రభుత్వంపై విశ్వాసం ఉందని అర్థం. ఒక్క మీటింగ్ తోనే అన్నీ పరిష్కారం కాకపోవచ్చు. కానీ మీరు అడిగే సమస్య న్యాయమైనదైతే మీ ఇంటి పెద్ద కొడుకుగా పరిష్కరించే బాధ్యత నాది అని భావోద్వేగంగా పేర్కొన్నారు. దరఖాస్తులన్నింటినీ ఆయా శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గెడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్లు శ్రీనివాస రెడ్డి, శ్రీజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నుపుసల సీతారాములు, కాంగ్రెస్ నాయకులు కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, బచ్చలకూరి నాగరాజు, నంబూరి రామారావు, జెర్రిపోతుల అంజనీ కడియాల నరేష్, సర్పంచులు బోయిన వేణు, రామారావు, అశోక్, రాణి, లక్ష్మణరావు, శివాజీ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కూనంనేనికి సిపిఐ నేతల పరామర్శ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం శాసనసభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఇటీవల కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న విషయం విధితమే. శస్త్ర చికిత్స చేయించుకుని కొత్తగూడెం వచ్చిన కూనంనేనిని సిపిఐ నేతలు పరామర్శించారు. పరామర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, రావి శివరామకృష్ణ, నాయకులు పోటు పూర్ణచందర్‌రావు ఉన్నారు.

# ఎఐయుకెఎస్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్ల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం దురదపాడు గ్రామంలో శనివారం అఖిలభారత ఐక్య రైతు సంఘం(ఎఐయుకెఎస్) జాతీయ మహాసభల గోడ పత్రికలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుంజా అర్జున్ అధ్యక్షతన రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి గోకినపల్లి ప్రభాకర్, మండల కార్యదర్శి వాసం బుచ్చిరాజు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. వచ్చే మే నెల 11, 12, 13 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఇల్లెందు పట్టణంలో ఎఐయుకెఎస్ జాతీయ మహాసభలు వైభవంగా జరుగనున్నాయని, దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు భవిష్యత్ కార్యచరణను రూపొందించేందుకు జరుగుతున్న ఈ మహాసభలను రైతులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. రైతు వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని, ఈ మహాసభలకు రైతు ఉద్యమ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ధర్మ శ్రీరాములు, మెచ్చు సోమరాజు, కారం రాజులు, పాయం పోతురాజు, సున్నం రామారావు, పూనెం దుర్గ, మాజీ సర్పంచ్ కుంజా లక్ష్మి, బంధం నాగమణి పాల్గొన్నారు.

# కల్లూరులో విజిలెన్స్ దాడులు

## రేషన్ షాపులు సీజ్

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని కల్లూరు కొర్లగూడెం, పేరువంచ గ్రామాల్లో రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి, సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఓ ఎస్ డి అంజయ్య తెలిపారు. ఉండవలసిన బియ్యం కన్నా అధికంగా ఉండటంతో కేసు నమోదు చేసినట్లు ఆర్ఐ నరేష్ తెలిపారు. అక్రమాలకు పాల్పడితే ఎవరినైనా వదిలేది లేదని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడినట్లు ఉన్నట్లు తెలిసినట్లయితే సమాచారాన్ని అందించాలని వారి సమాచారాన్ని రహస్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

# సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని జమలాపురం శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఆలయానికి వచ్చిన భక్తులకు మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఎర్రంరెడ్డి పున్నారెడ్డి, ఉమాదేవి దంపతుల వితరణతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతలు సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు బొబ్బా కృష్ణప్రసాద్, లక్కిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు కొడాలి విజయలక్ష్మి దేవి, ఉపాధ్యక్షులు గిరిజా లక్ష్మి, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, ఎల్‌వి నారాయణరెడ్డి, సహాయ కార్యదర్శి చింతా కిషక్షర్, కోశాధికారి వీరమాచనేని వెంకటకృష్ణ, కాకుమాను లీలాకృష్ణ, మాజీ ఇఓ అల్లూరి విష్ణుమూర్తి, చొప్పవరపు శ్రీనివాసరావు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని యువకుడి మృతి





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేంసూరు మండలం అడసర్లపాడు గ్రామానికి చెందిన సింగపోగు పృధ్వి (25) ద్విచక్ర వాహనంపై వేంసూరు నుండి సత్తుపల్లి వైపుకు వస్తుండగా, సత్తుపల్లి నుంచి వేంసూరు వైపుకు వెళ్తున్న లారీ ఎదురెదురుగా అతివేగంగా ఢీకొనడంతో సింగపోగు పృధ్వి (25) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న పృధ్వి మృతి చెందడంతో ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. పృధ్వి మృతి చెందాడన్న వార్త తెలియడంతో అడసర్లపాడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

## ఐటీసీ వద్ద ముగిసిన 24గంటల నిరసన దీక్ష

### -నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమణ



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాచలం ఐటీసీ పేపర్ బోర్డ్స్ అడ్మిన్ బ్లాక్ ఎదుట ఐఎన్‌టి యూసి మిత్రపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన 24గంటల నిరసన దీక్ష శనివారం ఉదయం 8:30గంటలకు విజయవంతంగా ముగిసింది. 14వ వేతన ఒప్పందంలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ, మెరుగైన వేతన ఒప్పందాన్ని సాధించడమే లక్ష్యంగా ఈ దీక్ష చేపట్టారు. గత 24గంటలుగా అడ్మిన్ బ్లాక్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపిన కార్మికులకు ఐఎన్‌టియూసి మిత్రపక్షాల సీనియర్ నాయకులు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈసందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో ఐఎన్‌టియూసి అధ్యక్షులు గోనే రామారావు మాట్లాడుతూ కార్మిక నాయకుడు యారం పిచ్చిరెడ్డి గత 24గంటలుగా ఆహారం, నీరు తీసుకోకుండా కఠిన దీక్ష నిర్వహించారని తెలిపారు. ఆయనకు కార్మికుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల చెమటతో లాభాలు పొందుతున్న యాజమాన్యం వేతన ఒప్పందంపై ఆలస్యం చేయడం తగదని, ఇప్పటికైనా సానుకూలంగా స్పందించి మెరుగైన వేతన పెంపును ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపిన కార్మికులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## వైరా నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/కారేపల్లి :** వైరా నియోజకవర్గ ఎంఎల్ఏ రాందాస్ నాయక్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశం, నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈసమావేశంలో వైరా నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల నాగేశ్వరరావు, 5వ వార్డు మెంబర్ బానోత్ వీరభద్రు, 7వ వార్డు మెంబర్ ధరావత్ లక్ష్మన్, నల్లమోతు కోటేశ్వరరావు, బొళ్ళ మధు, పత్తెం నవీన్, నున్న లక్ష్యాద్రి, పెద్దిరాజు ఫణి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంపై చర్యలు జరిపి, నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలపరిచే దిశగా కృషి చేయాలని నిర్ణయించారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే మండల అభివృద్ధి

### - అడిషనల్ సెక్రేటరి డా. సాయిబాబ



**ప్రజాపక్షం/గుండాల :** మండలం పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పని సరి అని అడిషనల్ సెక్రెటరి డాక్టర్ సాయిబాబ అన్నారు. ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో బాగంగా శనివారం మండల కేంద్రంలోని అంగన్‌వాడి సెంటర్ ,జెడ్పి హైస్కూల్ , కెజిబివి, ప్రాథమిక వైద్యకేంద్రాలను సందర్శించారు. అంగన్ వాడికేంద్రాల పనితీరును పరిశీలించి న్యూట్రీషన్ పిల్లలకు సక్రమంగా అందుతుందా లేదా అని పిల్లలను తెలుసుకొని సతృప్తిని వ్యక్తం చేశారు. జెడ్పి హైస్కూల్ ల్యాబ్‌ను పరిశీలిచి, విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని , పాఠశాలలో ఇంకా మెరుగైన సేవలు అందించేందు తన వంతు కృషిఉంటుందని వివరించారు. ప్రాథమిక వైద్య కేంద్రంలో రోగులకు సరైన వైద్యం అందుతుందాఅని రోగులను అడిగి తెలుసుకున్నారు. మందుల కొరత రాకుండా చూసుకోవాలని వైద్యాదికారి సూచించారు. కార్యక్రమంలో సిఇఒ నాగలక్ష్మి, డిఎంహెచ్ఒ తుకారం, సిపిఒ సంజీవరావు, సిడిపిఒ మంగతాయారు, ఎంపిడిఒ బాలరాజు, అంగన్‌వాడి కార్యకర్తలు , ఇంకాతదితర అధికారులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి నివారణకు చర్యలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** వేసవి కాలంలో నీటి ఎద్దడి నివారణ కోసం తగు చర్యలు చేపట్టామని ఎంపిడిఓ బొగ్గా నారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 36 గ్రామ పంచాయితీలలో నీటి కష్టాలను తొలగించటం కోసం మండల పరిషత్ కార్యాలయంలో 9966201931 అను టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఆయా గ్రామాలో నీటి సమస్యలు ఏర్పడిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన 24 గంటల వ్యవధిలో సమస్య పరిష్కారానికి సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

## ఘనంగా మలేరియా దినోత్సవం

**ప్రజాపక్షం/గుండాల :** ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి తుకారంరాథోడ్ ముఖ్యఅతిదిగా పాల్గొని పురవీదుల్లో వైద్య సిబ్బందితో కూడి ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా దోమలద్వారా వ్యాప్తిచెందే ప్రమాదకర వ్యాదిఅని, నీటి నిలువలు ఉండే ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని అన్నారు. మలేరియాను సమయానికి గుర్తించి సరైన వైద్యంతీసుకుంటే పూర్తిగా నివారించవచ్చునన్నారు. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటు తగు జాగ్రతలు పాటించాలని సూచించారు. 2030నాటికి మలేరియాను అంతం చేసే దిశగా ప్రతిఒక్కరు కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాదికారి సుదీప్, భద్రు, రాజు, భూలక్ష్మి , ఎంటిఎస్ పి సత్యం, దేవా, రాఘవులు, రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకం

**- క్రీడలు ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను ఇస్తాయి**
**- వేసవిలో క్రీడలపై మక్కువ పెంచుకోవాలి**
**- ఉచిత శిక్షణా శిబిరం మంచి అవకాశం**
**- ఎంఎల్ఏ కూనంనేని**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఆరోగ్య కరమైన సమాజ నిర్మాణంలో క్రీడల పాత్ర కీలకమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం కొత్తగూడెం పట్టణంలోని సింగరేణి సిఇఆర్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమ్మర్ స్పోర్ట్స్,గేమ్స్ కోచింగ్ క్యాంపుకు ఆయన ముఖ్యాతిథిగా హాజరైన జ్యోతిప్రజ్వలన చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ క్రశ శిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బలమైన పునాది వేస్తుందని ఆకాంక్షించారు. క్రీడలు కేవలం శారీర దృఢత్వానికే కాకుండా మానసిక ప్రశాంతతకు, ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. వేసవి సెలువులు కేవలం వినోదానికే కాకుండా విద్యార్థులు క్రీడలపై మక్కువ పెంచుకుని తమలో అంతర్గత ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు ఈ ఉచిత శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి తరం పిల్లలు సెల్‌ఫోన్లతో ఇళ్లకే పరిమితం కాకుండా మైదానాల్లో చమటోడ్చి ఆటలు ఆడి రేపటి ఛాంపియన్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ శిబిరంలో కబడ్డీ, క్రికెట్, సిమ్మింగ్, యోగా, అథ్లెటిక్స్, నెట్‌బాల్, ఆర్చరి, బాస్కెట్ బాల్, బాక్సింగ్, టెన్నీస్ వంటి పతి రికాల క్రీడల్లో విష్ణాతులైన కోచ్‌లతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. జూన్ 7 వరకు సాగే ఈ శిబిరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొని మెళుకువలు నేర్చుకోవాలని కోరారు. క్రీడల ద్వారా అలవడే ఓర్పు, పట్టుదల జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొవడానికి తోడ్పడతాయని అన్నారు. క్రీడాకారులకు కావాల్సిన అన్ని మౌళిక వసతులను సింగరేణి సహకారంతో కల్పిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను క్రీడల వైపు పోత్సహించాలని ఎంఎల్ఏ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి పరంధామిరెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి మహేందర్, బాక్సింగ్ మట్టపర్తి రమేష్, యుగంధర్ రెడ్డి, రమేష్ నాయుడు, వెంకటేశ్వర్లు, మల్లిఖార్జున, నాగేందర్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను నాలుగురోజుల్లో పరిష్కరించాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో తాగునీటి సమస్యను నాలుగు రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడిఓసి లో నిర్వహించిన జూమ్ సమీక్షా సమావేశంలో జల్లాలోని అన్ని మండలాల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతీ గ్రామానికి నీటి సరఫరా జరిగేలా చూడాలన్నారు. తహశిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలన్నారు. నీటి ఎద్దడి గల ప్రాంతాలను గుర్తించి వేరే ఏర్పాట్లు చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. మోటర్ల మరమ్మత్తులను చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలోని పెండింగ్ తాగునీటి సమస్యలపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో నీటి కొరత సమస్య అధికంగా ఉందని పేర్కొన్నారు. ఈ సమస్యను త్వరగాపరిష్కరించాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం

**-ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాల్లో ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం జరుగుతుందని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం బూర్గంపాడు మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమాలు ఉత్సాహంగా సాగాయి. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు పాల్గొని లబ్దిదారులను ఆశీర్వదించారు. వేపలగడ్డ గ్రామానికి చెందిన లబ్దిదారు తాటి సరోజిని గృహ ప్రవేశం, అదే విధంగా సందేళ్లరామాపురం గ్రామంలో పెద్దోజు అనూష గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేద ప్రజలకు సొంత ఇల్లు కల సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గృహ సౌకర్యం అందేలా ప్రభుత్వం కట్టుబడి పని చేస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వసతి మెరుగుపరచడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, మండల ప్రత్యేక అధికారి రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీవో జమలారెడ్డి, ఎస్ఐ మేడ ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బట్టా విజయ్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పి సుధాకర్‌రెడ్డి, సర్పంచులు బొల్లి నిరోశ, వర్స మంగమ్మ, తాటి లక్ష్మీ, బొర్రా సుభద్ర, తాటి వాణి, బాదం వెంకటేశ్వరరెడ్డి, పూణెం సురేందర్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మేడే పోస్టర్ ఆవిష్కరణ..



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ ఆధ్వర్యంలో 140వ మేడేను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మండల పరిధిలోని వెంగన్నపాలెం గ్రామంలో ఉపాధి కూలీలతో కలిసి మేడే పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా టియుసిఐజిల్లా ఉపాధ్యక్షులు ఏదులాపురం గోపాలరావు మాట్లాడుతూ చికాగో పోరాట అమరవీరుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న, ఎన్నో ఉద్యమాలతో కొట్లాడి సాధించుకున్న కార్మిక హక్కులను ఈరోజు నరేంద్ర మోడీ ప్రభుత్వం కాలరాస్తుందని ఆరోపించారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికులను కట్టు బానిసలుగా చేసే ప్రయత్నాలు ప్రారంభించిందని, ఆ వెలుగులోనే కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా అమలు చేస్తుందని అన్నారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో మేడే రోజున ఎనిమిది గంటల పని దినం సాధించుకుంటే ఇప్పుడు ఉన్న నరహంతక బిజెపి ప్రభుత్వం 12 గంటల పని విధానం తీసుకురావాలని కుటీల ప్రయత్నాలు చేస్తుందని దీన్ని కార్మిక వర్గం తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు కార్పొరేట్ కంపెనీలకు అనుగుణంగా కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్స్ తీసుకువచ్చి, పని గంటల పెంపు, సమ్మె హక్కును కాలరాస్తూ అతి తక్కువ వేతనాలతో కార్మిక వర్గానికి పని లేకుండా చేయాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూస్తుందని గోపాలరావు దుయ్యబట్టారు. యూనియన్ పెట్టే హక్కు లేకుండా ప్రశ్నించే హక్కు లేకుండా కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే విధంగా ఈ ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తుందని దీని వెలుగులోనే 140 మే డే ను కార్మిక వర్గం స్ఫూర్తిగా తీసుకొని మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని, నియంతలా వ్యవహరిస్తున్నమోడీ ప్రభుత్వానికి కార్మిక వర్గం ఒక తాటిపైకి వచ్చి తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని గోపాలరావు కోరారు. రాబోయే రోజుల్లో కార్మిక వర్గం పై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా జరుగు ఆందోళన కార్యక్రమాల్లో కార్మిక వర్గం ముందు వరుసలో ఉండాలని ఈ సందర్భంగా కోరారు. దేశంలో ప్రశాంతమైన వాతావరణంలో కలిసిమెలిసి బతుకుతున్న కార్మిక వర్గంపై ప్రజలపై దేశ ప్రజలను కుల మతాల పేరుతో విభజించి మనుషుల మధ్య తగాదాల సృష్టించి మతాల పేరుతో ప్రజలను విభజించాలనే కుటీల ప్రయత్నాలు చేస్తుందని, దీన్ని ప్రజలు ప్రజాస్వామిక వాదులు సంఘటితమై వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని వారన్నారు.కార్యక్రమంలో వినోద్, నాగేష్, మధు కనకమ్మ, అరుణ, లలిత, చందు, నాగయ్య, శ్రీదేవి, నరేష్, పద్మ భవానీ, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# తనిఖీలకు ఆదేశాలు...

**◗ ఆర్‌ఓ ప్లాంట్ల లెక్కతేల్చే పనిలో అధికారులు**
**◗ అనుమతులు లేని ప్లాంట్లపై నోటీసులకు సిద్ధం**
**◗ ప్రజాపక్షం కథనంతో కదిలిన యంత్రాంగం**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీలో అనుమతుల లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లపై ప్రజాపక్షం పత్రికలో మినరల్ మాటున జనరల్ అనే కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంలో మినరల్ మాటున జరుగుతున్న మోసాలు, నిబంధనలకు తిలోదాకాలిస్తున్న తీరు. అనుమతులు లేనట్లు అధికారులు ఇచ్చిన వివరణలతో పలు విషయాలు వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ కథనం తీవ్రచర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. అందులో భాగంగా ఎన్ని ఆర్వో ప్లాంట్లు ఉన్నాయనే లెక్కతేల్చేందుకు సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు జీపీఓలు, కార్యదర్శులు, మున్సిపాలిటీ సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు ప్రజాపక్షానికి తెలిపారు. ఈ నేపథ్యంలో అధికారులు ఎన్ని ఆర్వో ప్లాంట్లు ఉన్నాయి. వాటికి అనుమతలు ఉన్నాయా?లేవా? అనే అంశంపై సంబంధిత విభాగాల అధికారులు సమగ్ర పరిశీలన చేపట్టారు. ప్రాథమిక పరిశీలనలో కొంతమంది వాటర్ ప్లాంట్లు నిబంధనలు పాటిస్తున్నట్లు గుర్తించినప్పటికీ, అనుమతులు లేని ప్లాంట్లపై ఎటువంటి చర్యలు తీసుకోవాలి అనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించనున్నట్లు సమాచారం. అయితే ఈ కథనం అక్రమంగా వ్యాపారం సాగిస్తున్న కొంతమంది వ్యాపారులకు మాత్రం కొరకని కొయ్యగా మారింది. గుట్టుగా జరుగుతున్న వ్యాపారాన్ని బయటపెట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తుండగా, కొందరు వ్యాపారులు పెదవి విరుస్తుండటం విశేషంగా మారింది. ఇక సంబంధిత అధికారులు తదుపరి చర్యలపై ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



మినరల్ మాటున 'జనరల్'

**● లెక్కతేల్చే పనిలో అధికారులు...**

ఆర్వో ప్లాంట్ల లెక్కతేల్చే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు తెలిసింది. ప్రాథమిక పరిశీలనలో కొనసాగుతున్న ఆర్ఓ ప్లాంట్లలో చాలావరకు సరైన అనుమతులు లేకుండానే నడుస్తున్నట్లు అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. కొన్ని ప్లాంట్లు నిబంధనల ప్రకారం నమోదు చేసుకోకుండా, కనీస ప్రమాణాలు పాటించకుండా వ్యాపారం కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనుమతులు లేని ప్లాంట్లపై కఠిన చర్యలు తీసుకునే దిశగా అధికారులు కసరత్తూ చేస్తున్నారు. అనుమతులు లేని ప్లాంట్లలో శుద్ధి చేసిన నీటి నాణ్యతపై సందేహాలు వ్యక్త పరచడం పరిస్థితికి అద్ధం పట్టింది. ప్రజల ఆరోగ్యానికి హాని కలగకుండా ఉండాలంటే ఇటువంటి ప్లాంట్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్లాంట్లపై తరచూ తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**● ప్రజాపక్షం కథనంతో కదిలిన యంత్రాంగం...**

ఓ పక్క అనుమతలు, మరోపక్క అధికారుల అజమాయిషీ లేకుండా కొనసాగుతున్న ఆర్ఓ వాటర్ ప్లాంట్లపై ప్రజాపక్షం కథనంతో అధికార యంత్రాంగం కదిలింది. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్లాంట్లపై సంబంధిత విభాగాల అధికారులు పూర్తి నివేదిక సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారని సమాచారం. నివేదిక ఆధారంగా అనుమతులు లేని, నిబంధనలు పాటించని ఆర్ఓ ప్లాంట్లంపై నోటీసులు జారీ చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే భవిష్యత్తులో ఇటువంటి అక్రమాలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించనున్నట్లు సమాచారం. అయితే ఈ కథనం కొంతమంది అక్రమ వ్యాపారులకు మాత్రం కొరకని కొయ్యగా మారింది. గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న వ్యాపారం బయటపడడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అనుమతులు ఇప్పుడు తెచ్చుకోవడం ఎలా? అనే దానిపై మల్లగుల్లాలు పడుతుండటం అక్రమ వ్యవహారానికి అద్ధం పట్టింది. ఇందులో కొందరు మేకపోతు గాంభీర్యాన్ని సైతం కనబరుస్తున్నట్లు తోటి మినరల్ ప్లాంట్ల యజమానుల ద్వారా తెలిసింది. ఇన్ని రోజులు లేవు అనుమతులు ఇప్పుడుకూడా ఉండవన్న ధోరణిలో మాట్లాడుతుంటం గమనర్హం.



(ఫైల్)



# సిపిఐ కృషితో నిండుకుండలా...

**- సంవత్సరం క్రితం ఎండిపోయిన చెరువు**
**- విమర్శలకు సైతం చెక్ పెట్టిన ఫలితం**
**- 35 గ్రామాలకు అందుతున్న నీరు**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీలోని మినీ ట్యాంక్‌బండ్‌గా పేరుగాంచిన ఏదులాపురం చెరువు స్థానిక సిపిఐ కృషితో ఎర్రటి ఎండలోనూ నిండుకుండను తలపిస్తుంది. సరిగ్గా సంవత్సరం క్రితం ఇదే ఎండాకాలంలో పూర్తిగా ఎండిపోయిన చెరువు ఇప్పుడు జళకళను సంతరించుకుంది. ఈ నేపథ్యంలో భూగర్భజలాలు పదిలంగా నిలిచి నీటి కటకటకు చెక్ పడింది. ఆ నాటి కరువు కష్టాలు వర్ణనాతీతమైతే ఇప్పుడు పరవళ్లు తొక్కుతున్న జల సవ్వడిలతో వర్ణించ తరమా? అన్నట్టుగా మారింది. ఇంతలా నీరు నిండుకొని ఉండటానికి సిపిఐ పార్టీ చేసిన కృషి ఎంతో ఆదర్శనీయమైనదిగా చెప్పక తప్పదనే చెప్పాలి. ఈ నేపథ్యంలో పరిశర ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా 35 గ్రామాలకు నీరు సైతం ఇక్కడి సురక్షిత మంచినీటి పథకం ద్వారా అందుతుండటం విశేషం. తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు ఇప్పుడు లేకపోవడం ఊరట కలిగించిందని ప్రజలు చెబుతున్నారు. చెరువు నీటికై తీసుకున్న చర్యతో బావులు, బోర్లు కూడా నీటితో నిండడం సంతోషకర విషయమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సిపిఐ చేసిన కృషిని కొనియాడుతున్నారు.

**ట్యాంకర్ల ద్వారా నీళ్లందించాము**

చెరువు ఎండిపోయి ఏర్పడిన కరువుతో నీటి కోసం ప్రజలు అల్లాడిపోయారు. వారి పరిస్థితిని చూసి చలించిపోయి ట్యాంకర్ల ద్వారా మంచి నీళ్లను అందిచాము. కానీ ఇప్పుడు చెరువు నిండుకుండలా ఉండటంతో భూగర్భజలాలు పదిలంగా ఉండి బావులు, బోర్లలో నీళ్ళు సమృద్ధిగా ఉన్నాయి. ఇందుకు తమ పార్టీ తీసుకున్న నిర్ణయం అజరామరంగా నిలిచింది.



**28వ వార్డు సిపిఐ కౌన్సిలర్, దండి రంగారావు**

**విమర్శలకు చెక్ పెట్టిన ఫలితం...**

చెరువులో నీటిని నిల్వ ఉంచడం కోసం స్థానికి సిపిఐ పార్టీ తీసుకున్న నిర్ణయంపై వ్యక్తమైన విమర్శలకు ప్రస్తుతం పరిస్థితులు చెక్ పెట్టినట్టుగా మారాయి. ఆ సమయంలో పలువురు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ , నీటిని జాగ్రత్తగా నిల్వ ఉంచిన చర్యల వల్ల ఇప్పుడు చెరువు నిండుకుండలా మారి ప్రజలకు మేలు చేకూర్చుతోంది. నీటిని వృథాగా బైటికి పోనివ్వకుండా ఎన్ఎస్‌పీ అధికారుల ద్వారా సిపిఐ తూమును బలోపేతం చేయడం నీటి సవ్వడులకు నెలవుగా మారింది. ముఖ్యంగా భూగర్భజలాలు పెరగడం, పరిసర ప్రాంతాల్లో బావులు, బోరు నీటితో నిండిపోవడం వంటి మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో అప్పట్లో చేసిన విమర్శలు ఇప్పుడు అనవసరం లేదనేది తేలిపోయినట్లయిందని ప్రజలు పేర్కొంటున్నారు.

## అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి

### - ఎంఎల్ఏ కూనంనేని



**ప్రజాపక్షం/పాల్వంచ :** కొత్తగూడెం పట్టణంలో క్రీడా వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో క్రీడల అధికారి ఎం. పరంధామరెడ్డి ఆధ్వర్యంలో క్రీడా సమీక్షా సమావేశం శనివారం జరిగింది. ఈ సంధర్భంగా ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వివిధ క్రీడా సంఘాల ప్రతినిధుల అభ్యర్థన మేరకు బృందావనం ప్రాంతంలో 12 ఎకరాల స్థలాన్ని పరిశీలించామని చెప్పారు. ఈ స్థలంలో 400 మీటర్ల అథ్లెటిక్స్ సింథటిక్ ట్రాక్, స్విమ్మింగ్ పూల్, ఇండోర్ స్టేడియం నిర్మాణానికి డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా పాల్వంచ శ్రీనివాస కాలనీలో గల గ్రౌండ్‌లో 200 మీటర్ల సింథటిక్ ట్రాక్, బ్యాడ్మింటన్ కోర్టులను నిర్మించటంతో పాటు కొత్తగూడెం ప్రగతి మైదానంలో బాస్కెట్‌బాల్ కోర్టు మరమ్మత్తులు, క్రికెట్ గ్రౌండ్‌లో నెట్ ప్రాక్టీస్ అవసరమైన సదుపాయాలను అమునిసిపల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అథ్లెటిక్స్ కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్, మునిసిపల్, క్రీడల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించాలి

### - ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన విద్యార్థినీ విద్యార్థులు చదువులతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత క్రీడా శిక్షణా శిబిరాన్ని ఆయన ఐటిడిఏ పిఓ రాహుల్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ క్రీడాకారులు మరింత నైపుణ్యాన్ని సంపాదించుకునేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం క్రీడాకారులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏసిఎంఓ రమేష్, ఓసిడిఓ అలవేలుమంగతాయారు. సుభద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఐకేపి కార్యాలయ స్టోర్ రూమ్‌కు నిప్పు

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ మండల సెర్ప్ ( ఐకేపి) కిన్నెర ఎంఎస్ కార్యాలయానికి నిప్పు పెట్టి అత్యంత విలువైన రికార్డులను తగుల పెట్టడానికి ప్రయత్నించిన దుండగులను గుర్తించి తగిన న్యాయం చేయాలని పాల్వంచ టి. సెర్ఫ్ ద్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎండి. మీరాబీ పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన ప్రకారం స్థానికి మునిసిపల్ కార్యాలయం పక్కన భవిత కార్యాలయం వెనకాల ఉన్నటువంటి మహిళా సంఘం కార్యాలయ అటెండర్ రోజు వారీ విధుల్లో భాగంగా శనివారం కార్యాలయానికి చేరుకొన్నాడు. శుభ్రం చేస్తున్న సమయంలో పెట్రోల్ వాసన రావటంతో దగ్గరకు వెళ్ళి పరిశీలించగా స్టోర్ రోమ్ తలుపుల నుండి పెట్రోల్ పోసి కాల్చి వేసినట్టుగా గుర్తించాడు. దీనికి నిదర్శనగా ఓ వాటర్ క్యాన్, కాలి పోయిన అగ్గి పుల్లలు పడేసినట్లు ఉన్నాయి. దీనితో మాకు సమాచారం అందించాడు. అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించి స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఐకేపి ఏపిఎం మీరాబి తెలిపారు.

## మలేరియా పై అవగాహన ర్యాలీ



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని చంద్రుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ శనివారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది ప్రజలకు మలేరియా నివారణ చర్యలు, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. దోమల పెరుగుదలను నివారించేందుకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బి హరికృష్ణ, హెల్త్ సూపర్వైజర్లు ఎస్ పూర్ణారావు, ఎం బుజ్జమ్మ, పి విజయశ్రీ, హెల్త్ అసిస్టెంట్లు, సిస్టర్స్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మండే ఎండలోనూ నిరసన



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాచలం ఐటీసీ పీఎస్పీడీ యూనిట్‌లో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 31వ రోజుకు చేరుకున్నాయి. 13వ వేతన ఒప్పందంలోని పెండింగ్ అంశాలను పరిష్కరించడం, 14వ వేతన ఒప్పందాన్ని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల జేఏసీతో చర్యలు జరపాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. మండే ఎండను సైతం లెక్కచేయకుండా కార్మిక నాయకులు, కార్యకర్తలు దీక్షలో పాల్గొంటూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ, వెంటనే చర్చలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. దీక్షలు రోజురోజుకు ఉధృతమవుతుండగా, కార్మికుల్లో ఐక్యత మరింత బలపడుతోందని నాయకులు తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఎస్ఆర్ఎస్‌పి అధికారుల నిర్లక్ష్యం..!



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని గైగొళ్ళపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని చింతల్‌తండా, హత్యాతండా, ఉడుతలగూడెంకు వెళ్లే రహదారి దుస్థితి గిరిజన ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లా డివిజన్ ఎస్ఆర్ఎస్‌పి అధికారులు 21 ఆర్ కాలువ మరమ్మతుల నిమిత్తం నెల రోజుల క్రితం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి(రోడ్డు)ను తవ్వి, అలాగే వదిలివేయడంతో రాకపోకలకు పూర్తిగా అంతరాయం కలిగాయి. ఈ రహదారి ఆయా గ్రామాలకు ప్రధాన మార్గం కావడంతో, దానిపై ఆధారపడే ప్రజలు ఇప్పుడు తీవ్ర కష్టాలు పడుతున్నారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ సౌకర్యం అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు రోగులను ఆసుపత్రికి తరలించడం కష్టంగా మారింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లడం, రైతులు తమ పనుల కోసం బయటకు వెళ్లడం కూడా ఇబ్బందిగా మారింది.

### ఆగిపోయిన బస్సు సౌకర్యం...

ఖమ్మం నుండి గైగోల్లపల్లి వచ్చే బస్సు ప్రతి రోజు ఒక ట్రిప్పు ఉడుతల గూడెం, చింతల్‌తండ మీదుగా ప్రతి రోజు ఒక సారి నడిచే బస్ సర్వీస్ ఈ రహదారినీ తవ్వడంతో నెల రోజులుగా ఆగిపోవడంతో మహిళలకు, పిల్లలకు, ప్రయాణికులకు మరింత ఆటంకంగా మారింది. స్థానిక గిరిజనులు మాట్లాడుతూ రోడ్డు తవ్వి నెల రోజులు అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. వర్షాలు వస్తే పరిస్థితి మరింత దారుణంగా మారుతుందని, అత్యవసర సమయాల్లో మేము పూర్తిగా ఇరుక్కుపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మరిపెడబంగ్లా డివిజన్ ఎస్ఆర్ఎస్‌పి అధికారుల నిర్లక్ష్యమే పరిస్థితికి కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తవ్విన పనులను పూర్తి చేయకుండా వదిలేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

**-కాలువ మరమ్మతుల కోసం రోడ్డును తవ్వి వదిలేసిన అధికారులు**
**-తండాలకు రహదారి బంద్**
**-ఆగిపోయిన బస్సు సౌకర్యం**
**-అవస్థలు పడుతున్న గిరిజనులు**

### ఇబ్బందులు పడుతున్నాం : కుమ్మరికుంట్ల నాగేశ్వరరావు, స్థానికుడు.



నెల రోజుల క్రితం రోడ్డుని అడ్డంగా తొవ్వారని కుమ్మరికుంట్ల నాగేశ్వరరావు అన్నారు. పిల్లలు, పెద్దలు, వెళ్లడానికి ఇబ్బంది అవుతుందని, మా ఊరికి వచ్చే బస్సు సౌకర్యం కూడా ఆగిపోయిందని, ఎవరైనా పేషెంట్‌ని తీసుకెళ్లడానికి అంబులెన్స్ కూడా రాకుండా అయిందని, త్వరలో ఈ పనులు పూర్తి చేయాలని కోరారు.

### పనులు పూర్తి చేయాలి : జాల మోహన్‌రావు, స్థానికుడు.



గైగోళ్లపల్లి గ్రామ పంచాయితీ పరిధిలో చింతలతండా చెందిన జాల మోహన్‌రావు మాట్లాడుతూ నెల రోజుల క్రితం ఎస్ఆర్ఎస్పీ అధికారులు కాలువ కొరకు ఈ రోడ్డును తవ్వి వదిలేశారని, దీని వల్ల మేము రాకపోకలకు వ్యవసాయ పనులు, గడ్డి, వడ్లు తీసుకెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, త్వరగా పనులు పూర్తి చేయాలని తెలిపారు.

### ఎస్ఆర్ఎస్‌పి ఏఈ నరేందర్ బాబు వివరణకై ప్రయత్నం..

రహదారి సమస్యపై మరిపెడబంగ్లా ఎస్ఆర్ఎస్పీ ఏఈ నరేంద్రబాబును ప్రజాపక్షం విలేఖరి ఫోన్ ద్వారా వివరణకు ప్రయత్నం చేయగా ఎటువంటి సమాధానం అందించలేదు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే రహదారి పనులను పూర్తి చేయాలని, రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని గిరిజనులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే, ఆందోళనలు చేపట్టే అవకాశముందని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు.

## తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యునిగా దొండపాటి



**ప్రజాపక్షం/ బోనకల్ :** కొత్తగూడెంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మూడవ మహాసభలో బోనకల్ మండలం రావినూతల గ్రామానికి చెందిన దొండపాటి నాగేశ్వరరావును రాష్ట్ర కమిటీ సభ్యునిగా నియమించారు. సాధారణ కార్యకర్తగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన నాగేశ్వరారవు అంచలంచలుగా ఎదుగుతూ మండల కార్యదర్శి స్థాయి వరకు చేరుకుని ఇప్పుడు రాష్ట్ర కార్యవర్గ స్థాయికి ఎంపిక కావడం ఆయన కృషి, నిబద్ధతకు నిదర్శమని, రైతు సమస్యలపై నిరంతరం పోరాడుతూ గ్రామీణ స్థాయిలో రైతులకు అండగా నిలిస్తూ మంచి పేరు సంపాదించుకున్న దొండపాటి నాగేశ్వరావు తెలంగాణ రైతు సంఘం రాష్ట కమిటీ సభ్యునిగా ఎన్నికోవటం పట్ల రావినూతల గ్రామ ప్రజలు, రైతు సంఘం నాయకులు హర్షం వ్యక్త ంచేశారు. ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి రైతుల సమస్యల పరిష్కారంలో కీలకపాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## కెసిఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్, కేటిఆర్‌లపై ఇటీవల సోషల్ మీడియాపై వైరల్ అవుతున్న కొన్ని సంచలన వ్యాఖ్యల నేపథ్యంలో అశ్వారావుపేట బిఆర్ఎస్ ముఖ్య నాయకులు కాసాని నాగశేషా, పద్మ, 14వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ ఉదయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తీవ్రంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను తెగించి పోరాడిన కేసిఆర్‌ను ఆహర్నిశలు కష్టపడుతున్న కేటిఆర్‌ను విమర్శించడం అత్యంత హేయమైన చర్య అని వారు పేర్కొన్నారు. కేసిఆర్‌ని తెలంగాణ జాతిపితగా ప్రజలందరూ గుండెల్లో పెట్టుకున్నారని, అటువంటి నాయకుడిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం రాజకీయ దిగజారుడుతనానికి నిరద్శనమని మండిపడ్డారు. కేసిఆర్ నాయకత్వంలోనే తెలంగాణ అనిన రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఆ గౌరవానిన తగ్గించే ప్రయత్నం ఎవరూ చేసిన సహించేది లేదని హెచ్చరించారు.

## పోలీసులకు సవాల్ విసురుతున్న దొంగలు

**-వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న ప్రజలు**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలో వరుస దొంగతనాలతో దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు. గత కొన్ని రోజులుగా బేతుపల్లి, సత్తుపల్లిలో జరిగిన దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలోని మెయిన్ రోడ్ నందు వేర్వేరు ప్రాంతాలలోని షాపులల్లో నలుగురు దుండగులు చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సత్తుపల్లి పట్టణంలోని ప్రదాన రహదారి పక్కనే ఉన్న షాపులను టార్గెట్ చేసుకుని దొంగతనానికి పాల్పడ్డారు. బాలాజీ స్వీట్ షాప్ లో సుమారు రెండు వేల నగదు, అనూస్ కూల్ డ్రింక్స్ అండ్ బెల్ట్ షాప్ లో సుమారు పది వేల రూపాయల మద్యం బాటిల్స్ ను దొంగతనం చేశారు. అదేవిధంగా మసీద్ రోడ్డు లో గల పాన్ షాప్ తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించాక అక్కడ ఎమి దొరకకపోవటంతో అక్కడ నుండి ఉడాయించారు. అయితే ఆ నలుగురు దుండగులు చోరీకి పాల్పడిన దృశ్యాలు సిసి కెమెరా లో రికార్డు అవ్వటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సిసి పుటేజ్ ఆధారంగా సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్ర గాయాలు



**ప్రజాపక్షం/ బోనకల్ :** కారు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలపై సంఘటన బోనకల్ మండలంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోనకల్ మండలంలోని బోనకల్ నుండి వత్సవాయి వెళ్లే రహదారిలో పెద్ద కాలువ వద్ద ఎదురెదురుగా అతివేగంగా వస్తున్న కారు, ఢీకొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులు గుంటూరుజిల్లాకు చెందిన వీరు సెవంత్ డే అడ్వెంటిస్ట్ చర్చిలో పనిచేస్తున్నారు. ఉదయం గుంటూరు నుంచి ఖమ్మం వచ్చి ప్రజాపరిషత్ సమావేశం ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం అడవిమల్లెల గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఖమ్మం మెడికల్ కాలేజ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామపంచాయతీ సర్పంచ్ లీలావతి ప్రారంభించారు. ఈ శిబిరానికి వంద మంది రోగులు హాజరవగా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి శస్త్ర చికిత్సలు అవసరమైన 21 మందికి ఖమ్మంలోని మమతా జనరల్ అండ్ సూపర్ స్పెషాలిటీ వైద్యశాల నందు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాజీ సర్పంచ్ మందడపు అశోక్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ వైద్యులు డాక్టర్ ధనిష్, డాక్టర్ సలోమి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ దివ్య మరియు వైద్య బృందం గ్రామస్తులు ఆముదాల రాములు, బత్తుల నాగేశ్వరరావు, దారావత్ బాలాజీ, శనగోని సోమమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**




**ప్రజాపక్షం/కల్లూరు:** గత తొమ్మిది నెలలుగా కల్లూరు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలను చెల్లించకపోతే వారి జీవనాన్ని ఏ విధంగా కొనసాగించాలని ఏఐటియుసి ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు ప్రశ్నించారు. శనివారం మున్సిపల్ కార్మికుల తొమ్మిది నెలల పెండింగ్ విత్తనాలు చెల్లించాలని కోరుతూ కల్లూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రామాంజనేయులు మాట్లాడుతూ గత నెలలోనే సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని మున్సిపల్ చైర్మన్ చర్చలు జరిపి 15 రోజుల్లో జీతాలను వేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం దురదృష్టకరమైన విషయం అన్నారు. సమ్మె నోటీసు ఇచ్చిన తర్వాత చర్చలు జరిగిన తర్వాత ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. 9 నెలలుగా వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అన్నారు. వారికి ఇంటి రెంట్ తో పాటు, నిత్యవసర వస్తువులు కొనుక్కోవటం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. 9 నెలల వేతనాలను చెల్లించిన యెడల మే రెండవ తారీకు నుండి నిరవధిక సమ్మె చేస్తామని వారు హెచ్చరించారు.. అనంతరం సమ్మె నోటీసును కల్లూరు సబ్ కలెక్టర్ కు అందించారు. ఈ కార్యక్రమంలో *ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు, జిల్లా సమితి సభ్యులు రహమతుల్లా, తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఓడల కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి సయ్యద్ వజీర్ మియా, కల్లూరు మున్సిపల్ నాయకులు సుధాకర్, ప్రకాష్, గొల్లమందల యశోద, అంజలి, బాబు, మణిరాజ్, చింతపల్లి శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

# సత్తుపల్లిలో ఆర్టిసి కార్మికుల సంబరాలు

**-ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం**
**-శంకర్ గౌడ్ మృతికి ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ సంతాపం**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఆర్‌టిసీ కార్మికులతో ప్రభుత్వం జరిపిన చర్చలు పూర్తిస్థాయిలో సఫలమైన సందర్భంగా సత్తుపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ రవీందర్‌లు ఆర్టీసీ కార్మికులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ డాక్టర్ మట్టా దయానంద్, కార్మికులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పూలు, పాలాభిషేకం చేశారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపట్ల తీవ్ర విషాదం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఆర్టీసీ జేఏసీ నాయకులు, కార్మికులు, సత్తుపల్లి, కల్లూరు మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, 5 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉప సర్పంచులు, మహిళా, యూత్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

# నేడు రామాలయంలో కళావాహన

**- మధ్యాహ్నం వరకు దర్శనాలు బంద్**
**- పూజా కార్యక్రమాలకు చిన్న జీయర్ స్వామి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయాభివృద్ధి పనుల్లో భాగంగా నేడు రామాలయంలో జీర్ణోద్ధరణ అనుజ్ఞ,కళా వాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు వైదిక కమిటీ అన్ని ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో చినజీయర్ స్వామి పాల్గొననున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుండి మధ్యాహ్నం 1 గం. వరకు ఆలయంలో భక్తులకు దర్శనాలను నిలిపివేయనున్నారు. రంగనాయకుల గుట్టపై ఉన్న ధ్యాన మందిరంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో మధ్యాహ్నం 3 గం.ల నుండి భక్తులకు స్వామివారిని దర్శించుకునే ఏర్పాట్లు చేశారు. అదే ప్రాంతంలో 72 మంది దేవతామూర్తులను భద్రపరిచనున్నారు.

**విస్తరణ పనుల్లో భాగంగా రూ.351 కోట్ల తొలిదశ పనులకు కేటాయించిన విషయం విధితమే.**

**విస్తరణతో మార్పులు :** ప్రభుత్వం నిదులు విడదల చేయడంతో నేటి నుండి రామాలయ అభివృద్ధి తొలిదశ పనులకు అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే శుక్రవారం ఆర్అండ్‌బి అధికారులు మార్కింగ్ కూడా చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయ ప్రాంగణంలో పలు అభివృద్ధి పనులు జరగనున్నాయి. తూర్పు, ఉత్తర, దక్షిణ గోపురాల వైపు విస్తరణ పనులు జరగనుండటంతో ఆలయ ప్రాంగణం మరింత విశాలం కానుండటంతో పాటు సదుపాయాలు, సౌకర్యాలు మరింతగా పెరగను



న్నాయి. వైకుంఠ ఏకాదశి ఉత్సవాల సమయంలో స్వామివారు భక్తులకు ఉత్తర ద్వారం గుండా దర్శనభాగ్యాన్ని ఇస్తారు. ప్రస్తుతం ఉన్న ఉత్తర ద్వారాన్ని మరింతగా వెడల్పు చేసిందుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం సుమారు 1 వెయ్యి మంది మాత్రమే దర్శనం కోసం క్యూలైన్లలో ఉండే వెసులుబాటు ఉంది. కానీ విస్తరణ తర్వాత 1500 నుండి 2 వేల మంది వరకు భక్తులు క్యూలైన్లలో వేచి ఉండేందుకు ఏర్పాట్లు చేయనున్నారు. అంతే కాకుండా భక్తులు వేచి ఉండేందుకు ప్రత్యేకంగా నాలుగు గదులను సైతం నిర్మించనున్నారు. ఈ గదుల్లో సుమారు 3 వేలమంది వరకు వీలుంటుందట. క్యూలైన్లలో భక్తులు కదిలేందుకు ఆలస్యమైతే వారి కూర్చుని విశ్రాంతి తీసుకునేందుకు కూడా సదుపాయాలు కల్పిస్తున్నారు. మూల వరుల దర్శనం తర్వాత కూర్చునేందుకు సదుపాయలు, మరుగుదొడ్ల వెసులుబాటు కల్పిస్తున్నారు. అదే విధంగా వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు.

# స్వచ్ఛందంగా అక్రమణలు తొలగించాలి..

**- 27 కల్లా ఆక్రమణలు తొలగించకుంటే కఠిన చర్యలు**
**- మైక్ ప్రచారం నిర్వహించిన పంచాయతీ సిబ్బంది**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల కేంద్రంలోని తల్లాడ, కొత్తగూడెం ప్రధాన రాష్ట్రీయ రహదారి ఆక్రమణల తొలగింపు కోసం యంత్రాంగం చర్యలకు సిద్ధమైంది. గత ఏడాదికాలంగా ప్రధాన రహదారి పక్కన ఉన్న సైడ్ డ్రైన్ ను కొందరు ఆక్రమించడంతోపాటు రోడ్డుపైనే వ్యాపారాలు వెలిశాయి. మరికొందరు ఆక్రమణదారులు ఆక్రమించిన స్థలాల్లో పటిష్ట గదుల నిర్మాణాలు చేసి, అద్దెలకిస్తూ అక్రమ ధనార్జనకు పాల్పడుతున్నారు. దీని కారణంగా రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయంతో పాటు ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. రోడ్డు ఆక్రమణల కారణంగా వాహనాలు ప్రమాదానికి కూడా గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రధాన రహదారితో పాటు పాపకొల్లు క్రాస్ రోడ్, చంద్రుగొండ క్రాస్ రోడ్, జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాల్లోకి వెళ్లే ప్రధాన కూడళ్ళ వద్ద కూడా ఆక్రమణలు ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారాయి. మండల కేంద్రం ప్రధాన రహదారి మొత్తం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో ఉంటుంది. దీంతో ప్రజల అసౌకర్యాన్ని, ప్రమాదకర పరిస్థితులను



దృష్టిలో ఉంచుకొని గత ఏడాదికాలంగా వెంగన్నపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం ద్వారా ఆక్రమణదారులకు పలుసార్లు నోటీసులు కూడా ఇచ్చారు. నోటీసులు అందిన 48 గంటల్లోగా రోడ్డు ఆక్రమణలను తొలగించాలని, లేనియెడల శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయినా ఆక్రమణలు ఆగకపోగా ప్రధాన రహదారి ఆక్రమణల పర్వం మరింత కొనసాగడంతో తప్పని పరిస్థితుల్లో గ్రామ పంచాయతీతో పాటు, (ఆర్అండ్ బి) రహదారులు, భవనాలశాఖ ఆక్రమణల తొలగింపుకు శాఖాపరమైన చర్యల కోసం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే గత మూడు రోజుల క్రితం మండలం కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి రోడ్డు సరిహద్దును గుర్తిస్తూ రెడ్ మార్కింగ్ కూడా ఇచ్చారు. అనంతరం శుక్రవారం వెంగన్నపాలెం గ్రామ పంచాయతీలో మైక్ ప్రచారం కూడా నిర్వహించారు. 27వ తేదీలోగా ప్రధాన రహదారి వెంట సైడ్ డ్రైన్ వరకు ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా ఎవరికి వారే తొలగించాలని ఆదేశించారు. లేనియెడల ఆ తర్వాత శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రచారంలో వివరించారు.

# వైరా పుర ప్రక్షాళన జరిగేనా...?

**ప్రజాపక్షం/వైరా:** వైరా పురపాలక కార్యాలయంలో ప్రక్షాళన జరిగినే, ఎందుకు అంటే వైరా పురపాలక కార్యాలయంలో జరుగుతున్న వరుస పరిణామాలు పనితీరును చూస్తే ప్రక్షాళన అవసరమనే తెలుస్తుంది. నూతన పాలకవర్గం వచ్చి నెలలు గడుస్తున్నా కూడా మార్పు రాలేదని చెప్పవచ్చును. ప్రక్షాళన చేయకపోతే ఎలాంటి మార్పు కనిపించదనే వాదన పలుచోట్ల వినిపిస్తుంది. వచ్చిన అధికారులు కొన్ని రోజులకే ఇక్కడ నుంచి వెళ్లిపోవడానికి ప్రయత్నాలు ఎందుకు చూస్తున్నారు. అసలు అధికారులు వచ్చినప్పుడు ఉన్న సంతోషం వెంటనే పోవడానికి ఎందుకు బదిలీకి ప్రయత్నం చేయవలసి వస్తుంది. అసలు కారణమేమిటి అనేది కూడా అన్వేషణ అవసరం ఉంది. వైరా పురపాలక కార్యాలయంలో తలను తోకలాడిస్తున్నాయని వాదన బయట వినిపిస్తూ ఉంది. అసలు ఆ తోకలు ఎందుకు తలను ఆడిస్తున్నాయి. ఎక్కడి నుంచి వచిచంది ధైర్యం, వారి వెనక ఉన్నది ఎవరు? అనేది కూడా తెలియాల్సిన అవసరం ఉంది. కొత్త పాలకవర్గం కొత్త కొత్త ఆశలతో మంచి పాలకవర్గం వచ్చింది. ఈ పాలకవర్గం ప్రజలకు అనుకూలంగా పాలన కొనసాగిస్తామని ప్రతి ఒక్కరూ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో తెలిపారు. కాని ప్రక్షాళన జరుగుతుందా అనేది కూడా ఇప్పుడు తెలియాల్సిన అవసరం ఉంది. ఒక పక్క అవినీతి ఆరోపణలు మరో పక్క అధికారులు మాట వినని సిబ్బంది పరిస్థితి ఇక్కడ ప్రధమంగా కనిపిస్తూ ఉంది. ప్రక్షాళన విషయంలో అధికారులకు పూర్తి స్వేచ్ఛ అవసరం, అలా వారికి స్వేచ్ఛ ఇచ్చినప్పుడే పనితీరుపై పాలనపై పట్టు బిగించవచ్చు. కాని ఇక్కడ విచిత్ర పరిస్థితులు విచిత్ర రాజకీయం చోటు చేసుకుంటున్నాయి. ఎవరైనా తప్పు చేస్తే వారిని ఎక్కడైనా దండించాలని చూస్తే రకరకాల రాజకీయాలు ఇక్కడ కనిపిస్తూ ఉన్నాయి. ప్రతిఒక్కరి వెనుక ఒక రాజకీయ హక్కు ఉంది అని ఇక్కడ వినిపిస్తూ ఉన్నాయి. ప్రతిఒక్కరి వెనుక ఒక రాజకీయ హక్కు ఉంది అనేది అవసరం, ఆ క్రమశిక్షణ లేకపోతే అనుకున్న ఆశయం సాధించలేరు.




అధికారులకు అధికారులకు మధ్య సక్రమైన సంబంధం లేకపోవడం కారణమని చెప్పవచ్చును. విధి నిర్వహణకు వచ్చే కొందరు కార్మికులు వారు సక్రమ ప్రవర్తనతో రావడం లేదు అని అధికారులు మందలిస్తే మందలిచ్చిన మరికొద్ది గంటల్లోనే రాజకీయ పార్టీ నేతలు ఫోన్‌లు, ఇలా అయితే మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం ఎలా అవుతాయి, ఉదయం పూట విధి నిర్వహణకు వచ్చిన కొందరు మద్యం మత్తులో తూగూతూ ఉన్నారు. అసలు ఎవరు ప్రభుత్వ అధికారులు ఎవరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఎవరి మాట ఎవరు వినాలి, వైరా పురపాలక కార్యాలయంలో జరుగుతుంది ఏమిటి, కీలకమైన పనుల విషయంలో అధికారుల మాటలను పక్కన పెట్టి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్ని పనులు చేస్తూ ఉంటే మందలించాల్సిన బాధ్యత ఎవరిది, అధికారులు కూడా ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలి తప్ప ఎవరో చెబితే ఎవరో మందలిస్తే పనులను చేయడం కాదు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారుల పాలన కొనసాగాలి. ఇప్పటికైనా వైరా పురపాలక కార్యాలయంలో ప్రక్షాళన జరుగుతుందో లేదో వేచి చూడాల్సిందే.

# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

**- రాహుల్‌గాంధిని ప్రధాని చేయడమే మనందరి లక్ష్యం**
**- ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మానవతారాయ్**





**ప్రజాపక్షం/వైరా:** వైరా నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా శాసనసభ్యులు మాలోతు రాందాస్‌నాయక్, సంఘటన్ సృజన్ అభియాన్ నియోజకవర్గ సమన్వయ కర్త మానవతారాయ్, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసంనిరంతరం కృషి చేస్తామని, పార్టీ నాయకత్వం చాలా పటిష్టంగా ఉందని, ఎన్నిక వచ్చిన కాంగ్రెస్ అభ్యర్థుల విజయం అన్నారు. రాహుల్‌గాంధిని ప్రధానమంత్రి చేసేందుకు నిరంతర కృషి చేస్తామని అన్నారు. మానవతారాయ్ మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నిర్ణయాల మేరకు పార్టీ బలోపేతం కోసం సంఘటన్ సృజన్ అభియాన్ ప్రోగ్రాం తీసుకొని పార్టీ బలోపేతం కోసం కార్యచరణ రూపొందిస్తుంది. దాంట్లో భాగంగానే ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం నూతన కమిటీని నియమించడం, దేశంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ప్రజా సంక్షేమాన్ని అందించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ కార్యకర్తలందరూ సమన్వయంతో వ్యవహరించి పార్టీ బోలపేతానికి కృషి చేయాలని చూపించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, మండల అధ్యక్షులు వడ్డే నారాయణరావు, స్వర్ణ నరేందర్, తలారి చంద్రప్రకాష్, మంగీలాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు దొడ్డా పుల్లయ్య, రాంపూడి రోశయ్య, పగడాల మంజుల, పమ్మి అశోక్, ప్రభావతిరెడ్డి, రేణుకా, మస్తాన్, సామేల్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, డాక్టర్స్ సెల్ అధ్యక్షులు కాపా మురళీకృష్ణ, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, దాసరి దానియేలు, సూరంపల్లి రామారావు, సూతకాని జైపాల్, చెరుకూరి కిరణ్, కోసూరి శ్రీను, నాయకులు వీరంశెట్టి సీతారాములు, పాలేటి నర్సింహారావు, దార్న రాజశేఖర్, గరిడేపల్లి కిషోర్, జవ్వాజి నాగరాజు, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఇది ఆర్టీసీ కార్మికుల ఐక్య విజయం

**- ఆర్టీసీ కార్మికులకు మద్దతు ఇచ్చిన అన్ని రాజకీయ పార్టీ, కుల సంఘాలకు ధన్యవాదాలు**
**- ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ఆర్టీసీ అఖిలపక్ష జేఏసీ, రాజకీయ పార్టీ నాయకులు**



**ప్రజాపక్షం/మణుగూరు:** ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, అనేక డిమాండ్లు సాధన కోసం ప్రభుత్వం అంగీకరించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కారం దిశగా కృషిచేసిన ప్రభుత్వానికి మణుగూరు ఆర్టీసీ కార్మికుల జేఏసీ, రాజకీయ పార్టీలు కృతజ్ఞతలు తెలియజేశాయి. శనివారం ఉదయం తెల్లవారుజామున మణుగూరు ఆర్టీసీ డిపో ఎదుట ఆర్టీసీ కార్మికుల జేఏసీ ,ఆర్టీసీ కార్మికులు, సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జేఏసీ నాయకులు రాంబాబు, కృష్ణ, పవన్ మరియు వీరికి మద్దతుగా సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి దుర్గాల సుధాకర్ ఏఐటీయూసీ మణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు లు హాజరై మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు చేస్తున్నటువంటి ఆందోళనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వారి డిమాండ్ల పరిష్కారం కోసం కృషి చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. శంకర్ గౌడ్ కు ఈ విజయ అంకితం అందిస్తూ, వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ ఆందోళనలో ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలిచినటువంటి రాజకీయ పార్టీ సిపిఐ, సిపిఎం, తెలుగుదేశం, సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్, బీసీ సంఘం నాయకులు, కార్మిక సంఘాల నాయకులు, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో ఆర్టీసీ కార్మికుల ఏ సమస్య వచ్చినా వారికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మురళి రాంబాబు, ఆర్టీసీ కార్మికులు సిద్ధులు, లింగయ్య, ఉపేందర్, రమాదేవి, స్వరూప రాణి, కె.వి.ఆర్.రావు పాల్గొన్నారు.

# రోడ్కెక్కిన ప్రగతి చక్రం

- సమ్మె అనంతరం విధుల్లోకి ఆర్టీసీ కార్మికులు
- ఫలించిన పోరాటం
- మద్దతు దారులకు కృతజ్ఞతలు
- ముఖ్య, ఉప మంత్రికి పాలాభిషేకం
- కార్మికలోకంలో సంబురాలు





**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** మూడు రోజుల పాటు కొనసాగిన ఆర్టీసీ కార్మికుల సమ్మె ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర ఆర్టీసి జేఏసి ఆధ్వర్యంలో ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలం కావడంతో జిల్లాలోని భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు డిపోలకు చెందిన కార్మికులు తిరిగి విధుల్లో చేరారు. తమ డిమాండ్ల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో సమ్మెను విరమిస్తున్నట్లు కార్మిక సంఘాలు ప్రకటించాయి. సమ్మె కారణంగా గత మూడు రోజులుగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ పూర్తిగా స్తంభించడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా సమ్మె ముగియడంతో మళ్లీ బస్సులు రోడ్లపైకి రావడం వల్ల ప్రయాణికులకు ఉపశమనం లభించింది. కార్మికుల పోరాటం ఫలించిన నేపథ్యంలో ఆర్టీసి కార్మికులు, ఉద్యోగులు ఆనందోత్సాహాల్లో మునిగి తేలుతున్నారు. తమ సమ్మెకు మద్దతు ప్రకటించిన రాజకీయ పక్షాలు, కార్మిక, ప్రజా సంఘాలకు, జర్నలిస్టులకు ఆర్టీసి కార్మిక జేఏసి నేతలు కృతజ్ఞతలు తెలిపుతూ, సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ముందుకు రావడంతో ధన్యవాదాలు తెలిపుతున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతలు కందుల భాస్కర్, జీఎస్ నారాయణ, భద్రాచలం డిపో కార్యదర్శి బర్ల రమణారావు మాట్లాడుతూ ఇది కార్మిక విజయమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను త్వరితగతిన అమలు చేయాలని వారు కోరారు. మరో వైపు ప్రభుత్వం కూడా రవాణా సేవలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోబోతున్నట్లు నాయకులు నాయకులు తెలిపారు. సమ్మె ముగియడంతో రోడ్లపైకి మళ్లీ ఆర్టీసి బస్సులు తిరుగుతుండడగా సాధారణ జీవితం క్రమంగా పునరుద్ధరించబడుతోంది. ఇదిలా ఉండగా ఆర్టీసి సమ్మె కారణంగా అసువులు బాసిన శంకర్ గౌడ్ కుటుంబానికి జిల్లా ఆర్టీసి జేఏసి కార్మిక లోకం ఘన నివాళ్లర్పించింది. ఈసందర్భంగా కుటుంబానికి సంతాం, సానుభూతి ప్రకటించింది. కార్మికుల గుండెల్లో శంకరన్న కలకాలం నిలిచిపోతారని తెలిపారు.

**ప్రభుత్వం సానూకూలంగా స్పందించడం హర్షణీయం - కూనంనేని - ఎంఎల్ఏ**



**కొత్తగూడెం :** ఆర్టీసి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానకూలంగా స్పందించడం హర్షణీయం. చర్చల ద్వారా సమస్యలు పరిష్కారం కావడం శుభ పరిణామం, భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవాలి. సంఘటిత పోరాటాలతో సమస్యలు పరిష్కారం కాపడం ఖాయమని మరోసారి రుజువైంది.

**ఐఖ్యపోరాట ఫలితం - ఎస్‌కే సాబీర్ పాషా - సిపిఐ జిల్లా కార్యదర్శి**



: ఇది పూర్తి ఆర్టీసి కార్మికుల ఐఖ్యపోరాట ఫలితం. మూడురోజుల పాటు కష్టనష్టాలు భరించి తమ హక్కుల కోసం నిలబడ్డ కార్మికులకు న్యాయం జరిగింది. కార్మిక సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

# పేదల కోసం పోరాడిన అమరజీవి ఏలూరి

-వర్ధంతి సభలో ఘన నివాళులు



**ప్రజాపక్షం/కారేపల్లి:** అణచివేతకు గురవుతున్న పేదల పక్షాన నిలిచి పోరాడిన మహానేత అమరజీవి ఏలూరి లక్ష్మీ నారాయణ అని సీపీఐ(ఎం)జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగుసత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు కొనియాడారు. కారేపల్లి మండలం గాంధీనగర్ గ్రామంలో శనివారం ఆయన 34వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏలూరి స్మారక స్థూపానికి నాయకులు పూలమాలలు అర్పించి నివాళులు ఘటించారు. పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకులు కేసగాని రామ్మూర్తి ఎగరవేశారు. మండల కమిటీ సభ్యులు కేసగాని ఉపేందర్ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు ఏలూరి సేవలను స్మరించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ, కార్యకర్తలను శత్రువుల దాడుల నుండి కాపాడుతూ ఎల్లప్పుడూ వారి వెన్నంటే నిలిచిన దీశాలి ఏలూరి అని పేర్కొన్నారు. ఈనెల 26న ఖమ్మంలో నిర్వహించనున్న ఏలూరి జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కే నరేంద్ర, వైరా డివిజన్ కమిటీ సభ్యులు బానోత్ బన్సీలాల్, కొండబోయిన ఉమావతి, మండల నాయకులు కరపటి సీతారాములు, రేగళ్ల మంగయ్య, ఎండి ఇస్మాయిల్, దాసరి మల్లయ్య, అజ్మీర శోభన్, కల్తీ రామచంద్రు, పండగ కొండయ్య, పోతర్ల నాగేశ్వరరావు, షేక్ సైదులు, ఎనమనగండ్ల రవి, బోజడ్ల గోవిందరావు, తేజావత్ చందర్, పూనెం బాబు, గోవర్ధనగిరి దశరథ, ఎరిపోతు ముత్యాలు, ఈసాల పగడయ్య, అడపా రామనాథం, గుండా వెంకట్ రెడ్డి, వేముల రామ్మూర్తి, బత్తుల శ్రీనివాసరావు, చావా నాగేశ్వరరావు, ఉపేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

# మత్తుకు బానిసవుతున్న యువత..!

- దావత్ పేరుతో అర్ధరాత్రులు బెల్టు షాపుల్లో యువత
- మద్యం సేవించటం విలాసమనుకుంటున్న మైనర్లు
- పిల్లలను విలాస వంతంగా పెంచుతున్న తల్లిదండ్రులు



**ప్రజాపక్షం/జూలూరుపాడు :** మ ండలంలో మద్యం మత్తుకు యువత బానిస అవుతోంది. పూర్వం రాజులు సురాపాణం పేరుతో ఓ మత్తు పానీయం తాగే వారు. కానీ నేడు యువత దావత్‌ల పేరుతో మత్తుకు అలవాటు పడుతున్నారు. బీర్లు, వైన్లు, బ్రాంది, విస్కీ, ఓడ్కా అంటు ఎన్నో రకాల పేర్లతో ప్రభుత్వాలే అనుమతులిచ్చి టెండర్ల రూపంలో మార్కెట్లలో టెండర్లను సొంతం చేసుకున్నవారితో అమ్మిస్తోంది. అనుమతులిచ్చిన మద్యం షాపులు మండల కేంద్రానికి ఒకటి రెండు ఉంటే ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం అమ్మకాలు చేపడుతున్న బెల్టు షాపులు వందల కొద్దిగా ఉంటున్నాయి.

**దావత్ల పేరుతో మద్యానికి బానిసవుతున్న యువత..**

ఈ మధ్య కాలంలో దావత్తులు బాగా పెరిగిపోయాయి. ఇవి కూడా చదువుకున్న యువతే ఎక్కువగా చేసుకుంటున్నారు. ఎవరు ఏ రంగంలోనైనా ఓ చిన్న విజయం సాధించారంటే చాలు అతని మిత్రులు, బంధు వర్గాలతో బార్ షాపు, బెల్ట్ షాప్, దాబా, రెస్టారెంట్లో కూర్చుని మద్యం తాగుతూ జల్సా చేస్తున్నారు. జీవితాలను వ్యసనాల పాలు చేసుకుంటూ అదేదో గొప్పపని చేస్తున్నట్లు ఫీలవుతున్నారు. తల్లిదండ్రులకు ఆసరాగా ఉండాల్సిన యువత మద్యం మత్తులో మునిగి తేలియాడుతూ బంగారు భవిష్యత్తును చేజేతులార పాడు చేసుకుంటున్నారు.

**మద్యం సేవించడం విలాసవంతం అనుకుంటున్న నవతరం యువకులు...**

సమాజంలో ఇప్పుడిడిప్పుడే అడుగులు వేస్తూ విలాస వంతమైన జీవితం సాగించాలని చూస్తున్న నవతరం యువకులు ఒకరిని చూసి మరొకరు అన్న చందంగా మద్యం మత్తుకు బానిసలవుతున్నారు. యువతరం పాశ్చాత్య సంస్కృతిని, విదేశీ పోకడలు, సినిమాలను ఎక్కువగా పాలో అవుతూ మద్యం తాగుతున్నారు. ఇది ఒక వయస్సు వచ్చిన యువకులే కాదు, నిండా పద్నాలుగేండ్లు నిండని వారు సైతం మందు తాగడం ఓ మజాగా ఫీలవుతున్నారంటే యువత ఆలోచనలు ఏ విధంగా పెడదోవ పడుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

**పిల్లలను విలాస వంతంగా పెంచుతున్న తల్లిదండ్రులు...**

కొందరు తల్లిదండ్రులు వారి వారి పిల్లలను అత్యంత విలాస వంతంగా పెంచాలన్న ఉద్దేశంతో వారు అడిగించే తడువుగా ఎంత పడితే అంత జేబు ఖర్చులకు ఇస్తుంటారు. దీంతో పిల్లలు అదినుండే చిన్నచిన్న విలాసాలకు అలవాటలు పడుతూ మద్యానికి బానిసవతున్నారు. సమాజంలో జరుగుతున్న కొన్ని విలాస వంతమైన సన్నివేశాలకు ఆకర్షితులవుతున్నారు. ఈ పరిస్థితి ఒక పట్టణ ప్రాంతాలకే కాక గ్రామీణ ప్రాంతాలకూ పాకింది. తల్లిదండ్రులు పిల్లలను వారి వ్యవహార శైలీ ఎలా ఉందో. పసిగట్టలేక వారి పనులలో ఉండటం కూడా కారణం. ఇంకో ప్రధానమైన అంశం విచ్చల విడిగా బెల్టు షాపులు ఉండటం, అవి యువకులను మత్తు ప్రపంచం వైపు అడుగులు వేసేందుకు కారణమవుతున్నాయి.

# రైతు ఉద్యమాలకు సిద్ధం

- విలేకరుల సమావేశంలో నేతలు



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** తెలంగాణ రైతు సంఘం మూడో మహాసభల్లో తీసుకున్న తీర్మానాలను అమలు చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, కార్యదర్శి తీగల సాగర్ తెలిపారు. కొత్తగూడెంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, రైతు సమస్యలపై 30 అంశాలపై చర్చించి తీర్మానాలు చేసినట్లు చెప్పారు. వ్యవసాయానికి శాస్త్రీయ ప్రణాళిక, ఎరువులువిత్తనాల సరఫరా, సాగునీరు సమయానికి అందించాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్యలు పరిష్కరించి లబ్ధిదారులకు భూమి హక్కులు, రుణాలు, రైతుబంధు ఇవ్వాలని కోరారు. మొక్కజొన్నకు రూ.2400 మద్దతు ధర, వరి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, రైతు భరోసా ఎకరాకు రూ.7500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాల కాలానికి 93 మందితో కొత్త రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతు సమస్యలపై రానున్న రోజుల్లో పోరాటాలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ విలేకరుల సమావేశంలో మూడు శోభన్, జూలకంటి, అన్నవరపు సత్యనారాయణ, కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా పోతినేని**

తెలంగాణ రైతు సంఘం ఏఐకేఎస్ రాష్ట్ర కమిటి అధ్యక్షుడిగా పోతినేని సుదర్శన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కొత్తగూడెంలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర 3వ మహాసభల్లో 3వ రోజు ఈ ఎంపిక చోటు చేసుకుంది. ఆయనతోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తీగల సాగర్, కోశాధికారిగా మూడ్ శోభన్ ఎంపికయ్యారు. వీరితోపాటు మరో పదిమందితో కమిటీని ఎంపిక చేశారు.

# ఉద్యోగుల పిల్లలు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగపర్చుకోవాలి

- డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్



**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ ఆధ్వర్యంలో భద్రాద్రి స్టేడియం, పి.వి కాలనీ, మణుగూరు ఏరియా నందు ఈ నెల 28 నుంచి మే నెల 22 వ తేదీ వరకు సింగరేణి ఉద్యోగుల బాలబాలికలకు (18 సంవత్సరాల లోపు) పలు క్రీడలలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ డిజిఎం (పర్సనల్) ఎస్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు అలాగే సాయంత్రం 5.00 గంటల నుండి 7.00 గంటల వరకు శిక్షణ నిర్వహించబడునని, ప్రతి క్రీడలో సుమారు 20 నుంచి 25 మంది బాలబాలికలకు 25 రోజులవరకు శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిక్షణ శిభిరంలో ఫుట్ బాల్, అథ్లెటిక్స్, వాలిబాల్, కరాటే మరియు బాస్కెట్ బాల్ విభాగాలలో వేసవి శిక్షణ తరగతులు ఉంటాయని ఈ శిక్షణ తరగతులు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ చే ప్రారంభించడం జరుగుతుంది అన్నారు. కావున, బాలబాలికలు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకొని మంచి క్రీడాకారులుగా ఎదిగేందుకు దోహదపడే ఇట్టి శిక్షణ శిభిరంలో సింగరేణి ఉద్యోగులు తమ పిల్లలను అధిక సంఖ్యలో సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో చేర్పించి ఈ వేసవి క్రీడా శిభిరాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# భార్యను బలితీసుకున్న దాడి

- చికిత్స పొందుతూ మహిళ మృతి

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** పచ్చని కాపురాన్ని అనుమానమనే పెనుభూతం నిలువుగా కూల్చేసింది. మద్యానికి బానిసైన భర్త అనుమానంతో భార్యపై కత్తితో అమానుష దాడికి దిగడంతో ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మూడు రోజుల తర్వాత శనివారం మృతి చెందింది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన కథనం ప్రకారం, మండల పరిధిలోని అయ్యన్నపాలెం గ్రామానికి చెందిన బొప్పి నాగరాజు, ఇదే గ్రామానికి పుణ్యేశ్వరి (42)లు గత 25 సం. క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్యా దాంపత్యం నడుమ ఇద్దరు మగ బిడ్డలకు జన్మనిచ్చారు. కుటుంబం సజావుగా సాగుతున్న సమయంలో మద్యానికి బానిసైన నాగరాజు భార్య పుణ్యేశ్వరి పై అనుమానం పెంచుకున్నాడు. దీంతో ఇరువురి మధ్య నిత్యం తీవ్ర గొడవలు చోటు చేసుకుంటుండేవి. ఇదిలా ఉండగా, గత మూడు రోజుల క్రితం మద్యం మత్తులో భార్యపై నాగరాజు విచక్షణా రహితంగా కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తీవ్ర గాయాలు కాపడంతో కుటుంబీకులు ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరిలించారు. ఆమె చికిత్సలు పొందుతూ శనివారం తెల్లవారుఝామున మృతి చెందింది. మృతురాలి సోదరి చంద్రకళ ఫిర్యాదు మేరకు జూలూరుపాడు సర్కిల్ సిఐ శ్రీలక్ష్మి కేసు నమోదు చేసి నాగరాజును అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.